వికలాంగులకు వీల్‌చైర్స్ అందజేత



శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన మనిగండ్ల కృష్ణయ్య అండ్ సన్స్ ఆధ్వర్యంలో ఆదివారం 10 మంది వికలాంగులకు వీల్‌చైర్స్ అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సహకారంతో జగ్గంగూడ గ్రామస్తులకు కంటి, వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మనిగండ్ల కృష్ణయ్యగుప్తా అండ్ సన్స్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, వీరబద్రరావు, ఉపసర్పంచ్ బుద్ధిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

ఘట్‌కేసర్: తాము కొనుగోలు చేసిన పట్టా భూమిలో రోడ్డు నిర్మించడం సమంజసం కాదని, కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు రాము, రవీంద్రకుమార్ అన్నారు. కాచవానిసింగారంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలోని 27 గుంటల భూమిని కబ్జాచేసి రోడ్డు నిర్మించారని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గ్రామంలోని కొందరి భూమికి దారి లేకపోవడంతో మా భూమిని కబ్జా చేయాలని రోడ్డు వేశారని, సంబంధించి అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

'సార్వత్రిక' సన్నద్ధత షురూ

లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై యంత్రాంగం దృష్టి



- పోలింగ్ కేంద్రాల మార్పులపై చర్యలు
- కుటుంబ సభ్యులందరూ ఒకే కేంద్రంలోనే ఓటు వేసేలా కసరత్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులతో పాటు కీలకమైన అంశాలపై సంబంధిత అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

కుటుంబం ఒకేచోట ఓటేసేలా..

ఒక కుటుంబంలో సాధారణంగా మూడునాలుగు ఓట్లు ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలో ఈ సంఖ్య రెట్టింపు ఉండొచ్చు. అయితే అక్కడక్కడా కొన్ని కుటుంబాల్లో ఒకరు ఓ పోలింగ్ కేంద్రంలో, వేరొకరు మరో పోలింగ్ కేంద్రంలో ఓటేసే పరిస్థితులు ఉంటున్నాయి. తద్వారా కొంతమంది ఓటేసేందుకు ఆసక్తి చూపించడం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. అందుకే ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. బీఎల్ఏల సహకారం లేదా సాంకేతిక సాయంతో ఈ ప్రక్రియకు పూనుకోవచ్చు. శాసనసభ ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే విడుదలైంది. దీని ప్రకారం జనవరి 6 నాటికి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. మార్పులుచేర్పులు.. విచారణ అనంతరం తుది జాబితాను ఫిబ్రవరి 8న విడుదల చేస్తారు. మార్చి రెండో వారం వరకు 18 ఏళ్లు నిండిన వారికి ఓటేసే అవకాశం కల్పించే వీలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాకే..

ఇటీవల శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ ఆయా పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి నివేదిక అందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ర్యాంపులు, విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి సక్రమంగా ఉందో లేదో గమనించాలని సూచించింది. గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలలో 29 శాసనసభ నియోజకవర్గాల్లో ఆయా ఎన్నికల నిర్వహణాధికారులు, రెవెన్యూ అధికారులు దీనిపై కసరత్తు మొదలుపెట్టారు. రెండు రోజుల్లో నివేదికను కలెక్టర్లకు అందించనున్నారు.

ప్రస్తుతమున్న పోలింగ్ కేంద్రాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు
హైదరాబాద్	3,986
రంగారెడ్డి	3,369
మేడ్చల్ మల్కాజిగిరి	2,397
మొత్తం	9,752

ఓటర్ల కూర్పుపై కసరత్తు

- ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల వారీగా గరిష్ఠంగా 1500 వరకు ఓటర్లను చేర్చారు.
- మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 1490 మంది ఓటర్లున్నారు.అత్యల్పంగా 345 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రం ఉంది. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయి. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో చాలాచోట్ల ఓటర్ల సంఖ్య తక్కువగానే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య గరిష్ఠంగా 1,500 ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఎక్కువ దూరం ఉండొద్దని భావిస్తున్నారు. 1,500 మంది కంటే అధిక ఓటర్లుంటే ఆయాచోట్ల రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఏదేని పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తించినా, ఓటర్లకు దూరంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందినా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. మార్పులు చేర్పుల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు సూచనలివ్వాలి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మేడ్చల్ రూరల్: పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవాలని, వారికి సలహాలు ఇవ్వాలని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమను ఉన్నత స్థితిలో నిలిపిన కళాశాలకు పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని స్పెక్ ఎన్సియేంట్స్ అధ్యక్షులు శిరీష్ రాంమూర్తి, సెక్రటరీ ఠాకూర్ అక్షయ్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బాల రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమన్యాయం



క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రభుత్వం అన్ని మతాలకు సమన్యాయం చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని నారాయణ గార్డెన్‌లో క్రిస్మస్ కానుకలు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని, క్రిస్మస్ పండుగ లోకంలో వెలుగులు నింపుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నాగజ్యోతి, కోఆప్షన్ సభ్యురాలు అరుణ, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెర్సీబాయి, కపానందం, పలు గ్రామాల పాస్టర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



అనురాగ్ సదస్సులో పాల్గొన్న గౌరవ అతిథి కామాక్షి ప్రసాద్

ఘట్‌కేసర్: ఆధునిక సాంకేతికతపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ జెఎన్టీయూ ప్రొఫెసర్ కామాక్షి ప్రసాద్ అన్నారు. ఆదివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్ఈ, స్ప్రింజర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటేషన్ ఇంటలీజెన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్–2023 (ఐసీఏసీఐఐ–2023) ముగింపునకు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక మార్పులకు అనుగుణగా అధ్యాపకులు తమను తాము ఆధునీకరించుకున్నప్పుడే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనం చేయగలరని, తమ పరిశోధనలతో సమాజానికి ఉపయోగకరమైన ఆవిష్కరణలు చేయవచ్చన్నారు. సీఈఓ నీలిమా, ప్రొఫెసర్ సోమయాజులు, డీన్‌లు విజయకుమార్, విష్ణమూర్తి, సతీశ్‌కుమార్, కన్వీనర్ శ్రీదేవి, కోకన్వీనర్ బాలకష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తసురేఖ భాస్కర్‌గౌడ్, కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ తదితరులు - సాక్షి, మేడ్చల్ జిల్లా

ఘనంగా నల్ల పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో నల్ల పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు నూతనంగా నల్లపోచమ్మ ఆలయం నిర్మించి నల్ల పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలను గత నాలుగు రోజులుగా వైభవంగా ,శాస్త్రోక్తంగా వేద పండితుల చేత నిర్వహించారు. ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను ఉత్సవాలను కన్నులపండవగా నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఆలయంలో ఉత్సవాలలో పాల్గొని పూజలు చేశారు.

అంబేడ్కర్ కన్న కలలు నిజం చేద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: భారత రాజ్యాంగ నిర్మాత అయిన బాబా సాహెబ్ అంబేడ్కర్ కనక్న కలలను నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర అంబెద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కీసరలో నిర్వహించిన అంబేడ్కర్ జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజ్యాంగం ర చించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. మాజీఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద దేశానికి అంబేడ్కర్ రాజ్యాంగం అందించారు



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న నాగేశ్

ఘట్‌కేసర్: ప్రపంచలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు అంబేడ్కర్ రాజ్యాంగం అందించాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లె నాగేశ్ అన్నాడు. ఆదివారం అరుణ్‌కుమార్ ఆ.ధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలామాల సమర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ కొందరికి చెందిన వ్యక్తి కాదని, దేశంలోని సబ్బండ వర్గాలకు దారచూపిన మహా నాయకుడని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, మృధులదేవి, నర్సింగ్‌రావు, రాజేశ్, అంజయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, అలియాబాద్ జెడ్పీహెచ్ఎస్ 2000–2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలియాబాద్‌లోని ఓ ఫామ్స్ హౌజ్‌లో ఆత్మీయసమ్మేళనం నిర్వహించుకున్నారు. జ్యోతీప్రజ్వలన చేసి అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను సాన్మానించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. విద్యార్థులంతా చేరి ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

అత్యున్నత స్థాయి పరిశోధనలు చేపట్టాలి



హ్యాకథాన్ విజేతలతో నల్లా మల్లారెడ్డి కళాశాల కార్యదర్శి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: గనుల శాఖ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపే దిశలో అత్యున్నత స్థాయి పరిశోధనలు చేపట్టాలని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి నల్లా మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కాచివానిసింగారం నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన ఐదు రోజుల జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్–23)కు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. హ్యాకథాన్‌లో పరిశోధించి కనిపెట్టిన పలు ఆవిష్కరణల, నమూన పరికరాలు ఆకట్టుకున్నాయి. 26 బృందాలకు చెందిన 156 మంది విద్యార్థులు ఐదు బృందాలుగా ఏర్పడి మైనింగ్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన 5 సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనిపెట్టారు. అనంతరం విజేతలుగా నిలిచిన 5 టీంలకు రూ. లక్ష చొప్పున బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ కేతిరెడ్డి సంధ్యావళి, డైరెక్టర్ డాక్టర్ దివ్య నల్లా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం



మేడ్చల్ రూరల్: కుత్బుల్లాపూర మండలం జీడిమెట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. మేడ్చల్ మండలం, మైసమ్మగూడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములు ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎల్లంపేట్, అత్వెల్లి, మేడ్చల్ కు చెందిన భక్తులు పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పూజఅనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధ్వంసమైన రోడ్డును పరిశీలించిన అధికారులు



ఘట్‌కేసర్: కాచవానిసింగారంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సీసీ రోడ్డును ఎంపీఓ నందకిశోర్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. అన్నదాతలు నారాయణ రావు కాల్వను దాటడానికి ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్న స్థానికులు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు విష్ణ, శ్యామ్, కోఆప్షన్ సభ్యుడు భద్రారెడ్డి, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబు



వెలుగుల్లో మేడ్చల్ ఉమానగర్ చర్చి

మేడ్చల్: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకునే క్రిస్మస్ పండగకు మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పలు గ్రామాలలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రార్థనల కోసం, వేడుకల కోసం చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. జింగిల్ బెల్స్, క్రిస్మస్ ట్రీ, ఏసు జననం , వంటి సన్నివేశాలతో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఏ చర్చి చూసినా విద్యుత్ దీపాల వెలగులో జిగేల్ మని కనిపించింది.

సబ్ కా సాథ్.. సబ్‌బ్ కా వికాస్‌తో దేశం అభివృద్ధి



చౌదరిగూడలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: సబ్ కా సాథ్.. సబ్‌బ్ కా వికాస్‌తో దేశం అభివృద్ధి చెంది ప్రపంచంలో భారత్ ప్రపంచంలో నంబర్ వన్ గా నిలుస్తుందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వికాసిత్ భారత్ సంకల్పయాత్ర ఆదివారం చౌదరిగూడ, కాచవానిసింగారంలో ఎంపీటీసీ శోభారాణితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలను స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రం అందించే ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందించాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ యత్రను ప్రారంభించారన్నారు. వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీఓ నందకిశోర్, సర్పంచ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చిలుకానగర్ టు అఫ్జల్ గంజ్ వరకు ఆర్టీసీ సేవలు

ఉప్పల్: చిలుకానగర్ నుంచి అఫ్జల్ గంజ్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. చిలుకానగర్ చౌరస్తా నుంచి 3 ఎస్ రూట్‌ను అలాట్ చేస్తూ ఆర్టీసీ అధికారులు బస్సు సేవలను అందుబాటులోకి తీసుకురావడం ప్రజలకు ఊరట నిచ్చిందని పరమేశ్వర్ రెడ్డి అన్నారు.

మహిళలకు నూతన వస్త్రాల పంపిణీ



బోడుప్పల్: క్రిస్‌మస్ పండుగను పురస్కరించుకుని బోడుప్పల్ జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ జె. గంగరాజు, పాస్టర్ పన్నీర్ సెల్వం ఆదివారం జీప్సీ చర్చిలో ఒంటరి మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలను అలవర్చుకుని, సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఇరుగు పొరుగు వారిని సోదర బావంతో చూడాలని, పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సోమవారం బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు క్రిస్‌మస్ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

బోడుప్పల్: ట్రస్మా మేడిపల్లి మండలం ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల మధ్య జరిగిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ పోటీల్లో చెంగిచర్ల విద్యా జ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆపాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం చెంగిచర్లలో మాట్లాడుతూ సీనియర్ ఖో ఖో విభాగంలో బాలురు ప్రథమ స్థానంలో, అలాగే సీనియర్ కబడ్డీ విభాగంలో బాలురు ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. సీనియర్ కబడ్డీ విభాగంలో బాలికల విభాగంలో ప్రథమ బహుమతి పొందారన్నారు. జూనియర్ కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ బహుమతి పొందగా, చదరంగంలో 7వ తరగతి విద్యార్థి అర్నవ్ ప్రథమ బహుమతి పొందినట్లు వెల్లడించారు.

భారత్‌ను విశ్వగురు స్థాయికి చేర్చుదాం



మాట్లాడుతున్న భరత్‌జీ

కీసర: భారతదేశం శక్తివంతమైన ప్రపంచాన్ని శాసించేస్థాయికి చేరుతుందని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహక్షేత్ర ప్రచారక్ భరత్‌జీ అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మల్కాజ్‌గిరి భాగ్ మహాసాంఘీక్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు 1,15,000 సంఘశాఖలు నడుస్తున్నాయని, 2025 ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవం నాటికి భారతదేశాన్ని విశ్వగురుస్థానానికి చేర్చేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేసి జీవితాలను స్థారకం చేసుకోవాలని స్వయంసేవకులకు పిలుపునిచ్చారు. భాగ్యనగర్ సంభాగ్ సంఘచాలక్ గంజం కృష్ణప్రసాద్, మల్కాజ్‌గిరి భాగ్‌సంఘ్‌చాలక్ డాక్టర్ నాగమోహన్ , సంఘపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ చేరుకున్న ఆయోధ్య రామయ్య అక్షింతలు



ఉప్పల్: ఆయోధ్య రామయ్య అక్షింతలు ఆదివారం ఉప్పల్‌కు చేరుకున్నాయి. దేవసాని బాలచందర్ ఆద్వర్యంలో అక్షింతలను ఊరేగింపుగా తీసుకువచ్చి చిలుకానగర్‌లోని శివాలయంలో భద్రపరిచినట్లు బాలచందర్ తెలిపారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి



ఉప్పల్: ఉప్పల్‌మిని శిల్పారామంలో వారాంతపు సెలవు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భాస్కర డాన్స్ అకాడమి గురువు సాత్విక శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బ్రహ్మాముురారీ, ప్రణమ్మ, మూషిక వాహన, చిన్ని శివవు, పుష్పాంజలి, హనుమ చాలీసా, వందేమాతరం, కృష్ణాష్టమి, కుండపై నృత్యం తదితర అంశాలను వేదం, మేఘ, ఖ్యాతి, జాహ్నవి, అక్షిత, పూర్వీక, ప్రజ్ఞ, తేజోమయి, పూజిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

కాప్రా: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో రైస్ సంస్థ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ సాయిరాంనగర్‌లో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. గత 3 నెలలుగా 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. పేద మహిళలకు ఆర్థిక చేయూతనందించే విధంగా స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారికి కుట్టుమిషన్లు అందించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం మహిళలకు అందించారు.

కల్తీ కుల్ఫీ కేంద్రాలపై పోలీసుల దాడి

మల్లాపూర్: జనాల ఆరోగ్యంతో ఆటలాడుతూ కల్తీ ఆహారపదార్థాలు తయారు చేస్తున్న ముఠాను గుట్టురట్టు చేశారు నాచారం పోలీసులు. కల్తీ కుల్ఫీ తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో నాచారం పీఎస్ పరిధిలోని కుల్ఫీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. కుల్ఫీ తయారీ కేంద్రంలో గడువు ముగిసిన ముడిపదార్థాలతో కుల్ఫీ తయారు చేసి విక్రయిస్తుండటంతో నిందితులను అదుపులోకి తీసుకుని, గడువు ముగిసిన ముడిసరుకును సీజ్ చేశారు. నిందితుడు రాజస్థాన్‌కు చెందిన రోషన్‌లాల్ జాట్‌గా గుర్తించారు.